




నేటి దినపత్రిక

సూర్య

www.suryaa.com

గుంటూరు పల్నాడు

శనివారం 11 అక్టోబర్ 2025 - పేజీలు 8


# నిలకడగా విద్యార్థుల ఆరోగ్యం



- అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న అనుపర్రు బీసీ వసతి గృహ విద్యార్థులు
- పరామర్శించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, కలెక్టర్ తమీమ్ అన్సారియా



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

పెదనందిపాడు మండలం అనుపర్రు బీసీ బాలుర వసతి గృహంలో అస్వస్థతకు గురి అయిన విద్యార్థుల ఆరోగ్యం పూర్తిగా నిలకడగా ఉందని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. పెదనందిపాడు మండలం అనుపర్రు బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో అస్వస్థతకు గురై గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను శుక్రవారం రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత శాఖ మంత్రి ఎస్ సవిత, ప్రత్తిపాడు శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులతో కలసి పరామర్శించారు. జీజీహెచ్ లోని పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న విద్యార్థులతో మంత్రి ఎస్ సవిత మాట్లాడి ఆరోగ్య వివరాలు, అస్వస్థతకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని చెప్పారని, త్వరలోనే డిస్చార్జి చేస్తారని విద్యార్థులకు మంత్రి ధైర్యం చేప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత శాఖ మంత్రి ఎస్ సవిత విలేకరులతో మాట్లాడుతూ పెదనందిపాడు మండలం అనుపర్రు బీసీ బాలుర వసతి గృహంలో 108 మంది విద్యార్థులు ఉండగా శుక్రవారం 56 మంది విధ్యార్థులు అస్వస్థతకు గురి అయ్యారన్నారు. అధికారులు వెంటనే స్పందించి స్థానికంగా విద్యార్థులకు ప్రాథమిక చికిత్స అందించారని, జ్వరం ఉన్న 16 మందిని మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించటం జరిగిందన్నారు. ప్రస్తుతం విద్యార్థులందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగ ఉందని, కొంతమందిని డిస్చార్జ్ చేయటం జరిగిందన్నారు. బీసీ సంక్షేమ హాస్టల్స్ విధ్యార్థులు అస్వస్థతకు గురైన మిగతా 3వ పేజీలో











## రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ వారోత్సవ వేడుకలు

**సమాచార హక్కు చట్టం, 2005-20 సంవత్సరాల ప్రస్థానం**

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం (రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్) అమలుకు 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆర్‌టీఐ వారోత్సవాల వేడుకలను ఘనంగా నిర్వహించి కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో న్యాయ నిపుణులు, ప్రముఖులు, అధికారులు పాల్గొని దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, బాధ్యత, మరియు ప్రజా పాలనను బలపరిచే ఆర్‌టీఐ చట్టం యొక్క ప్రాముఖ్యతపై చర్చించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి తేలప్రోలు రజని , ఆర్‌టీఐ చట్టం రూపొందడానికి దారితీసిన కారణాలు ఆ చట్టం ఆధారమైన సూత్రాలపై స్పష్టతనిచ్చే శక్తివంతమైన ప్రసంగం చేశారు. ఆర్‌టీఐ చట్టం రూపకల్పనకు ప్రధాన ప్రేరణగా నిలిచిన సామాజిక కార్యకర్త అరుణా రాయ్ పాత్రను ఆమె ప్రశంసించారు. రజనీ మాట్లాడుతూ సమాచార హక్కు వంటి చట్టాలు ప్రజలకు ప్రభుత్వంపై జవాబుదారీతనం కల్పిస్తాయని, ఇది మిగతా 3వ పేజీలో

**విద్యార్థుల అస్వస్థతపై ఇన్‌చార్జి మంత్రి**

## కందుల దుర్గేష్ ఆరా

**విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియకు ఆదేశం**



**గుంటూరు జిల్లా మేజర్ :** అన్నపర్రు బీసీ సంక్షేమ హాస్టల్ లో ఫుడ్ పాయిజన్ ఘటనపై ప్రసారమైన కథనాలపై జిల్లా ఇంచార్జ్ మంత్రి కందుల దుర్గేష్ స్పందించి వివరాలు ఆరా తీశారు. బీసీ బాలుర హాస్టల్ లో పదుల సంఖ్యలో విద్యార్థులకు అస్వస్థతకు గురవ్వడం బాధాకరమని పేర్కొన్నారు. వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించి వారికి మెరుగైన వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాని మంత్రి దుర్గేష్ ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని సూచించారు. త్వరతగతిన విద్యార్థులు కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగానికి సూచించారు.

# ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యం కల్పించండి



**పాత గుంటూరు మేజర్ న్యూస్ :**

గుంటూరు యన్. టి. ఆర్. బస్టాండ్ లోని తిక్కన సమావేశ మందిరం నందు శుక్రవారం జోన్ అధికారుల సమీక్షా సమావేశము జి.నాగేంద్ర ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, నెల్లూరు అధ్యక్షతన జరిగినది. ఈ సందర్భముగా జి. నాగేంద్ర ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, నెల్లూరు మాట్లాడుతూ "స్త్రీ శక్తి "పథకము అమలు జరుగుతున్న విధానమును డిపోల వారీగా సమీక్షించి, ఈ పథకము మరింత విజయవంతము అగుటకు తగు సూచనలు తెలిపారు. అంతేగాక బస్ స్టేషన్ల యందు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యములను కల్పించవలసిందిగా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశములో నెల్లూరు జోన్ డిపిటిఓ లు, డివై. సిటిఎమ్ లు, డివై. సిఎంఈలు మరియు సివిల్ ఇంజనీర్ వారు పాల్గొన్నారు.

# బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులను పరామర్శించిన : బలసాని



**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్ :** గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో చికిత్స పొందుతున్న బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులను శుక్రవారం ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ పార్టీ ఇంచార్జ్ బలసాని కిరణ్ కుమార్ పరామర్శించారు. పెదనందిపాడు మండలం, అనపర్రు గ్రామంలో, బీ.సీ బాలుర హాస్టల్ విద్యార్థులు 17 మందికి పైగా వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థకు గురైనారు. వారిని మెరుగైన చికిత్స కోసం, గుంటూరు పభుత్వ సమగ్ర వైద్యశాల(G .G.H) కు తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే ప్రత్తిపాడు నియోజకవర్గ వై. యస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బలసాని కిరణ్ కుమార్ మరియు గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమా ప్రభుత్వ వైద్యశాలకు వచ్చారు. చికిత్స పొందుతున్న విద్యార్థులతో వారు మాట్లాడారు. విద్యార్థులు అస్వస్థతకు గురిగావటం పై వారు ఆందోళన వ్యక్తం చేశారు. సంఘటనపై విచారణ జరిపి అందుకు బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు మరియు గుంటూరు తూర్పు నియోజకవర్గాల వై. యస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు మురుగునీటి శుద్ధి ప్లాంట్ ప్రారంభం




**తెనాలి, మేజర్ న్యూస్ :**

స్థానిక పూలే కాలనీలో నిర్మించిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ ప్రారంభోత్సవం శనివారం జరగనుంది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్నారు. రూ. 30 కోట్ల వ్యయంతో ఈ ప్లాంట్ ను నిర్మించారు. ఇప్పటికే ట్రయల్ రన్ నిర్వహించారు. దీని ద్వారా డ్రైనేజ్ మురుగు సమస్యకు పరిష్కారం లభించనుంది. మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక శుక్రవారం ప్లాంట్ ను సందర్శించారు. వార్డు పర్యటనలో భాగంగా ఆమె ప్లాంట్ ను సందర్శించి పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాట్ ద్వారా పట్టణం నుండి వచ్చే మురుగు నీటిని శుద్ధి చేస్తారని ఆమె తెలిపారు. మంచినీటి అవసరాలకు, రైతులకు ప్లాంట్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య శాఖ అధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబు, పబ్లిక్ హెల్త్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

# మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** మానవవనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా తాడేపల్లి పట్టణం, తాడేపల్లి రూరల్ మండలంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది మహిళలకు శుక్రవారం ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ చేశారు. 72వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన మహిళలకు టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో నియోజకవర్గ తెలుగు మహిళల ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు అందజేశారు. మంత్రి నారా లోకేష్ లబ్దిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంత్రి నారా లోకేష్‌కు ఎంతో రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మీ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ నియోజకవర్గంలో మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు కుట్టు మిషన్ల ద్వారా తమ కుటుంబ జీవనోపాదులను పెంచుకోవాలన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుందన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, స్వయం సహాయక సంఘాలను బ్యాంకు లింకేజీ, రుణాలు, మహిళల పేరిట ఇల్లు, తల్లికి వందనం వంటి వాటిని అమలు చేస్తూ మహిళలకు మరింత ప్రాధాన్యం ఇస్తున్నది కేవలం కూటమి ప్రభుత్వం మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శి వింజమూరి ఆశాబాల, తాడేపల్లి పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు అన్నే కుసుమ, తాడేపల్లి మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు బొర్రా కృష్ణ వందన, తాడేపల్లి పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ కొయ్యగూర మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఇప్పటం గ్రామంలో స్వచ్ఛత అవగాహన కార్యక్రమం




**మంగళగిరి, మేజర్ న్యూస్ :** నిర్మల ఫార్మసీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్) యూనిట్ ఉన్నత భారత అభియాన్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో ఇప్పటం గ్రామంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు కళాశాల నుండి బయలుదేరి, ఇప్పటం గ్రామ సచివాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రేఖా నరేష్ బాబు పరిసరాల పరిశుభ్రత, తడి – పొడి చెత్త వేర్పాటు, ప్లాస్టిక్ వినియోగ నిర్మూలన వంటి అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. తరువాత విద్యార్థులు ఇంటింటికి వెళ్లి ఇంటి పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత స్వచ్ఛత అవసరం వంటి అంశాలపై సర్వే నిర్వహించి ప్రజలకు చైతన్యం కల్పించారు. తరువాత అందరూ ఇప్పటం ప్రాథమిక పాఠశాలకు చేరుకుని మానవహారంగా ఏర్పడి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతతో కూడిన నినాదాలు, ఉన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ, పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం అందరూ కలిసి రాష్ట్ర ప్రభుత్వం సూచించిన "స్వచ్ఛత ప్రతిజ్ఞ" చేశారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినీ – విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రేవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి , ప్రిన్సిపల్ డాక్టర్ బి. పాముల రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇప్పటం గ్రామ సచివాలయం కార్యదర్శి నందం బాల పరమేశ్వరరావు, ప్రాథమిక పాఠశాల సీనియర్ టీచర్ నల్లపాటి మధుబాబు, ఎన్ ఎస్ ఎస్ స్టూడెంట్ కోఆర్డినేటర్స్ ఎం. బిందు ప్రియాంక, ఎస్.కే. రజియా బేగం, జి. ప్రజ్ఞ, ఎం. మధుమిత, పి. సాయి స్నిగ్ధ, ఎం.డి. హలీమా నౌరి, ఎం. హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# పంపిణీకి సిద్ధంగా 199 టిడ్కో ఇళ్లు

**– జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా**



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలో 199 టిడ్కో ఇళ్లు అన్ని హంగులతో నిర్మాణాలు పూర్తి చేసుకుని లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా వెల్లడించారు. అక్టోబరు 23 నాటికి మరిన్ని ఇళ్లను జత చేసి 200కు పైగా ఇళ్లను లబ్ధిదారులకు ఇళ్లు స్వాధీనం చేయనున్నామని తెలిపారు. స్వాధీన పరుచుకున్న ఇళ్లలో ఖచ్చితంగా ఎవరో ఒకరు నివాసం ఉండేలా చూడాలని లబ్ధిదారులను కోరారు. నివాసం లేకపోతే అసాంఘిక కార్యకలాపాలకు కాలనీలు నెలవుగా మారే అవకాశం ఉంటుందన్నారు శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు తో కలసి పురపాలక సంఘ పరిధిలోగల టిడ్కో హౌసింగ్ కాలనీ సందర్శించారు కోర్టు కేసుల్లో పెండింగ్ లో ఉన్న మరో 270 ఇళ్లకు సంబంధించి కూడా త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రుణాలు మంజూరు అవ్వని 300 మందికి పైగా లబ్ధిదారులకు అన్ని బ్యాంకుల ద్వారా క్యాంపు ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేసి మరీ ఇళ్లు స్వాధీనం చేస్తామన్నారు. సేల్ డీడ్ రిజిస్ట్రేషన్లు పెండింగ్ లో ఉన్న ఇళ్లకు అక్టోబరు 23 నాటికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తామన్నారు నరసరావుపేట టిడ్కో కాలనీ సకల సదుపాయాలతో ఉండటం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, ఇక్కడున్న లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలు అందుతున్న తీరు బాగుందని తెలిపారు ఎమ్మెల్యేతో కలిసి ఇప్పటికే నివాసం ఉంటున్న లబ్ధిదారుల స్థానికంగా నివాసం ఉంటున్న లబ్ధిదారుల నుంచి కాలనీలో సదుపాయాల గురించి తెలుసుకున్నారు. కాలనీలో వీధి దీపాలకు సాయంత్రంలోగా మరమ్మతులు చేయిస్తామన్నారు స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా సకల సదుపాయాలతో టిడ్కో కాలనీ తీర్చిదిద్దామని దీనికి కృషి చేసిన ప్రభుత్వ అధికారులకు మరియు సిబ్బందికి అభినందనలు తెలుపుతూ మిగిలిన వారికి కూడా టిడ్కో గృహాల స్వాధీనం సత్వరమే చేయాలని ఆదేశించారు ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు, తహసీల్దార్ వేణుగోపాల్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సుబ్బరాయ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**తెనాలి, మేజర్ న్యూస్ :** విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా పట్టణ, రూరల్ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ కోత విధించనున్నట్లు ఈ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బోరుగడ్డ అశోక్ కుమార్ తెలిపారు. 11 కెవి లైన్ల మరమత్తులు, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు వల్ల ఈ అంతరాయం కలుగుతుందన్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

# తెనాలి మున్సిపల్ కమిషనర్ కు చిరు సత్కారం

**– కేసన శంకరరావు**



**గుంటూరు, మేజర్ న్యూస్ :**

తెనాలి మున్సిపల్ కమిషనర్ గా ఈనెల 3వ తేదీన పదవీ బాధ్యతలు స్వీకరించిన జె. రామ అప్పలనాయుడును, ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను, సత్కారంతో అభినందించారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధిపై వారి ఇరువురి మధ్య చర్చలు జరిగినట్లు మీడియాకు తెలియజేశారు. ఇంకా వారు, గతంలో తెనాలి మునిసిపాలిటీ రాష్ట్రంలో అన్ని విధాల ముందంజలో ఉందన్నారు. పచ్చదనం– పరిశుభ్రత లోను, రోడ్లు– మురుగు కాలువలు –పార్కుల నిర్వహణలోనూ తెనాలి పట్టణం కేంద్ర– రాష్ట్రప్రభుత్వాల మెప్పు పొంది, పలు బహుమతులు అందుకుందన్నారు. తెనాలి పట్టణ గత వైభవాన్ని నిలబెట్టేలా, ప్రజలకు మరింత మెరుగైన సేవలందేలా, నూతన కమిషనర్ అప్పలనాయుడు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, తప్పక పట్టణ ప్రజలందరి మెప్పు పొందేలా, తెనాలి పట్టణ గత వైభవాన్ని పునరుద్ధరించేలా ప్రజలకు సేవలు అందిస్తానన్నారు.

# సమగ్ర పూడికతీతలు చేపట్టాలి : కమిషనర్





**గుంటూరు మేజర్ న్యూస్:** నగరంలో డ్రైన్లపై ఆక్రమణలను, ర్యాంప్ లను తొలగించిన ప్రాంతాల్లో సమగ్రంగా పూడిక తీత చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ బృందావన్ గార్డెన్స్, రాజేంద్ర నగర్, చాకలి గుంట, శశాంక్ గోయల్ కాలనీ, బాలాజీ నగర్ టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రైన్లలోకి వర్షం నీరు వెళ్లడానికి వీలులేకుండా నిర్మాణం చేసిన ఆక్రమణలను, ర్యాంపులను దశల వారీగా తొలగిస్తున్నామని, ఆయా ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అధికారులు పూడికతీత పనులు చేపట్టి, అవసరమైతే నూతన డ్రైన్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. తొలగించిన పూడిక వ్యర్థాలను వెంటనే తరలించాలన్నారు. శశాంక్ గోయల్ కాలనీలో జిఎంసి నుండి తీసుకున్ననిర్దేశిత ప్లాన్ కి భిన్నంగా నిర్మాణం చేస్తున్న భవనాన్ని పరిశీలించి తక్షణం తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. బాలాజీ నగర్ టీచర్స్ కాలనీలో అభివృద్ధి పనులు, పారిశుధ్యం పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో రోడ్ ఆక్రమణలు తొలగించకపోవడంపై పట్టణ ప్రణాళిక కార్యదర్శులను ఆదేశించి, ప్రతి సచివాలయం పరిధిలో ముఖ్యంగా డ్రైన్, ప్రధాన రోడ్ల ఆక్రమణల తొలగింపుపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, ఏసిపి రెహ్మాన్, డిఈఈ కళ్యాణరావు, ఎస్.ఎస్. ఆయూబ్ ఖాన్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు,సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



# గుర్తింపు పొందిన పార్టీ ప్రతినిధుల సలహాలు, సూచనలు ఇవ్వండి

**ఈఆర్ఓ, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు**

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

త్వరలో స్థానిక ఎన్నికలు రానున్న సందర్భంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచనలు అమలు చేయుటకు చర్యలు తీసుకుంటామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఈఆర్ఓ, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శుక్రవారం జిఎంసి ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్ చాంబర్ లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ, స్థానిక ఎన్నికలు రానున్న నేపధ్యంలో ఎన్నికల కమిషన్ వారి ఆదేశాల మేరకు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో 12 వందల మందికి మించిన ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను, అదే ప్రాంతంలో మరొక కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా కేంద్రాల ఏర్పాటుపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల నుండి సూచనలు తీసుకున్నామని, వాటిని నిబంధనల మేరకు పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల పేర్లు, చిరునామాలు మార్పులు ఉంటే వాటిని కూడా తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన జిఎస్టీ 2.0పై రాజకీయ పార్టీలు కూడా ప్రజలకు అవగాహన కల్గించాలని కోరుతూ ఆయా పార్టీల ప్రతినిధులతో కలిసి జిఎస్టీ తగ్గింపుపై రూపొందించిన పోస్టర్ ని ఆవిష్కరించారు. సమావేశంలో జిఎంసి డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఎన్.ఓంకార్ (తెలుగుదేశం), హెచ్.రామకృష్ణ (బిజెపి), డి.జాన్ బాబు (వైఎస్ఆర్సీపీ) సిహెచ్.వాసు (బిఎస్పీ), బిల్లా సునీల్ కుమార్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్) తాతా సేవా కుమార్ (అమ్ ఆద్మీ పార్టి), షేక్ కాశీం(సిపిఐ(యం), ఎన్నికల విభాగం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# అంధుల జీవితాలలో వెలుగులు నింపిన పబ్బరాజు

**మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు**



**గుంటూరు, మేజర్ న్యూస్ :** కీర్తిశేషులు పబ్బరాజు వేంకటేశ్వర రావు రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి 1993లో ఉద్యోగ విరమణ చేసిన అనంతరం అంధుల జీవితాల్లో మార్పులు తేవడానికి శ్రీ షిర్డీ సాయి దీన జన సేవా సమితిని స్థాపించి వందలాది అంధ విద్యార్థులకు విద్యను అందించిన మహనీయులు కీ.శే. పబ్బరాజు వేంకటేశ్వరరావు అని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు కొనియాడారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో పబ్బరాజు వేంకటేశ్వర రావు, రాజ్యలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మానవ సేవా జాతీయ పురస్కారాలను అందించిన సందర్భంగా జరిగిన సభకు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. కె.యస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ పబ్బరాజు వేంకటేశ్వరరావు శ్రీమతి రాజ్యలక్ష్మి సహకారంతో వందలాది అంధులను పట్టభద్రులుగా తీర్చిదిద్దారని, అనేకమంది ప్రభుత్వ ఉద్యోగులుగా, ఉపాధ్యాయులుగా, బ్యాంక్ ఆఫీసర్లుగా ఉద్యోగాలు పొందినారని వివరించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ పబ్బరాజు వేంకటేశ్వరరావు మరణానంతరం పబ్బరాజు వేంకటేశ్వరరావు, రాజ్యలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ ను ఏర్పాటు చేసి అంధులు, వికలాంగులు, అనాథల సేవలో నిమగ్నమైన వ్యక్తులకు ఒక పురస్కారం, మరొక పురస్కారం ఉన్నత విద్యను అభ్యసించి అత్యుత్తమ స్థాయికి చేరుకున్న దివ్యాంగులకు అందించడం అభినంద నీయమన్నారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయ వాదిగా, ప్రపంచ అంధుల సంఘానికి అధ్యక్షులు గా కృషి చేస్తున్న సంతోష్ కుమార్ రుంగ్టాకు మానవ సేవ జాతీయ పురస్కారం అందించడం హర్షనీయమన్నారు. వీరి కృషితోనే 2016లో పార్ల మెంట్ దివ్యాంగుల చట్టాన్ని ఆమోదించి అమల్లోకి తెచ్చిందన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల యంలో జాతీయ స్థాయిలో మొదటి పి.హెచ్.డి పొంది తొలి దివ్యాంగునిగా ప్రసిద్ధిగాంచిన ప్రొఫెసర్ మన్నవ సత్యనారాయణకి మానవ సేవా జాతీయ పురస్కారాన్ని అందజేయడం సంతోషకర మన్నారు. వీరిరువురికి లక్ష రూపాయల నగదు ప్రోత్సాహకంతో పాటు ప్రశంసాపత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. శ్రీ షిర్డీ సాయి దీన జన సేవా సమితి అధ్యక్షులు ఏ. పూర్ణచంద్ర రావు ప్రసంగిస్తూ చల్లా భాస్కర రత్నం వికలాంగ పురస్కారాన్ని విద్యారంగంలో సేవలందిస్తున్న కె.అనూషకి అందించడం సంతోషంగా ఉందన్నారు. వివిధ ప్రాంతాల నుండి దాదాపు 300 మంది అంధ విద్యార్థులు, అంధ ఉద్యోగులు ఈ పురస్కార ప్రధానోత్సవానికి హాజరైనారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు యు. మధుసూదన్ రావు, వి. పాండు రంగారావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రంగయ్య, వివిఎస్ మూర్తి తదితరులు ప్రసంగించారు.

## నిలకడగా విద్యార్థుల ఆరోగ్యం

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం తెలిసిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్యాబినేట్ సమావేశంలో ఉన్న బీసీ వెల్ఫేర్ డైరక్టర్ ను వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించటం జరిగిందన్నారు. విద్యార్థుల ఆరోగ్యపరిస్థితిపై ప్రత్యేకంగా మాట్లాడటం జరిగిందన్నారు. బీసీ సంక్షేమ హాస్టల్ లో విద్యార్థులు అస్వస్థతకు గురి అవటం బాధకరమని ఇటువంటి సంఘటనలు తిరిగి పునరావృత్తం కాకుండా అవసరమైన అన్నిచర్యలు పకడ్బందీగా తీసుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలు సంక్షేమ హాస్టల్స్ నిర్వహణను గాలికి వదిలివేసిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమ హాస్టల్స్‌లో అవసరమైన మౌలికసౌకర్యాలు కల్పించటానికి నాణ్యమైన భోజనంతో పాటు, విద్యను అందించేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రత్తిపాడు శాసనసభులు బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ పెదనందిపాడు మండలం అనుపర్రు గ్రామంలోని బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులు అస్వస్థతకు గురి అయ్యారన్న సమాచారం తెలిసిన వెంటనే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయటంతో పాటు స్థానిక నాయకుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. వసతి గృహంలో గురువారం రాత్రి భోజనం లేదా, నీటి కారణంగా విద్యార్థులకు అస్వస్థతకు గురి అయ్యి ఉండవచ్చని తెలిసిందన్నారు. విద్యార్థులు ఆసుపత్రి వాతవరణం వలన అందోళన చెందుతారని స్థానికంగా ఉన్న ఏసీ కళ్యాణ మండపంలో ఉంచి ప్రాథమిక వైద్య చికిత్స అందించటం జరిగిందని, జ్వరం ఉన్న 18 మంది విద్యార్థులను జీజీహెచ్ కు తీసుకురావటం జరిగిందని వివరించారు. జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా వెంటనే సంఘటన స్థలానికి వెళ్ళి జిల్లా వైద్యశాఖ అధికారులను, జీజీహెచ్ వైద్యులను అప్రమత్తం చేసి అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన చికిత్సను అందించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. విద్యార్థులందరి ఆరోగ్య పరిస్థితి నిలకడ ఉందని, భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రజక కార్పొరేషన్ ఛైర్మన్ మల్లెల ఈశ్వర రావు, బీసీ వెల్ఫేర్ ఎక్స్ అఫిషియో సెక్రెటరీ ఎస్.సత్యనారాయణ, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్ ఎస్ వి రమణ , బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ వారోత్సవ వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)



ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరుస్తుందని తెలిపారు. భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 19 ప్రకారం భావ వ్యక్తీకరణ స్వేచ్ఛతో పాటు సమాచార హక్కు కూడా ప్రతి పౌరునికి ఉన్న మౌలిక హక్కు అని గుర్తుచేశారు. అదే విధంగా, ప్రజల ఫిర్యాదులను పరిష్కరించడంలో, ప్రజా అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంలో శ్రమిస్తున్న ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ సిబ్బందిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో మాజీ సమాచార కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డి పాల్గొని కమిషన్ పనితీరును మరింత సమర్థవంతంగా మార్చేందుకు విలువైన సూచనలు అందించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించడం ద్వారా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం అత్యవసరమని ఆయన సూచించారు. పి. శామ్యూల్ జోనథన్, ప్రస్తుత సమాచార కమిషనర్, కమిషన్ విధానాలను సులభతరం చేయడానికి తాను చేపట్టిన చర్యలను వివరించారు. ఆయన మాట్లాడుతూ, కేంద్ర సమాచార కమిషన్‌లో మాజీ కమిషనర్ హీరలాల్ సమారియా అమలు చేసిన ఉత్తమ పద్ధతులను ఆంధ్రప్రదేశ్ కమిషన్‌లో కూడా అమలు చేస్తానని, సాధ్యమైనంత వరకు అదే రోజు కేసు పరిష్కారం చేసే విధానం అమలు చేస్తానని తెలిపారు.పాలనలో ఖచ్చితత్వం మరియు పారదర్శకతను ప్రోత్సహించడంలో ఆర్టిఐ చట్టం, 2005 ప్రాథమికంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ వంటి సంస్థను బలోపేతం చేయాలని ఆయన దరఖాస్తుదారులను కోరారు. కేసుల వేగవంతమైన పరిష్కారాన్ని నిర్ధారించాలని, దరఖాస్తుదారులను మరియు ప్రభుత్వ అధికారులను సమానంగా మర్యాదగా చూడాలని మరియు కమిషన్ ఎక్కువ స్థాయిలో స్వయంప్రతిపత్తితో పనిచేసేలా చూసుకోవాలని సిబ్బందికి ఆయన పిలుపునిచ్చారు. అదనంగా, కమిషన్ రెగ్యులర్ ఉద్యోగుల కొరతతో పనిచేస్తోందని ఆయన ప్రస్తావించారు మరియు కమిషన్ సజావుగా పనిచేయడానికి కార్యదర్శి, సహాయ కార్యదర్శి, న్యాయ కార్యదర్శి,అకౌంట్స్ ఆఫీసర్ వంటి పదవులకు ఖాళీలను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డాక్టర్ చావలి సునీల్ , మరో సమాచార కమిషనర్, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విస్తృత అవగాహన కార్యక్రమాల గురించి వివరించారు. ఇప్పటివరకు 900కు పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, లక్షకు పైగా పౌరులకు సమాచార హక్కు ప్రాముఖ్యతను వివరించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కార్యక్రమాలను మరింత విస్తరించి, ఆర్‌టీఐ సందేశం ప్రతి గ్రామానికి చేరేలా కృషి చేస్తానని చెప్పారు. డా. చావలి సునీల్ తన తీర్పుల ద్వారా వేలాది మంది పౌరులకు న్యాయం చేకూరిందని పేర్కొన్నారు. తన సేవా తత్వాన్ని ఇలా వివరించారు. (చదువు - వినియోగించు -పంచు). ఆర్‌టీఐ వారోత్సవాల వేడుకలు గత 20 సంవత్సరాల ఆర్‌టీఐ ప్రయాణాన్ని స్మరించుకోవటానికి మాత్రమే కాకుండా, భవిష్యత్తులో పారదర్శకత, సులభతరత మరియు ప్రజా సాధికారత పట్ల కమిషన్ యొక్క అంకితభావాన్ని మరొక్కసారి ప్రతిబింబించాయి.

# విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షణ చేసిన కలెక్టర్





**ప్రత్తిపాడు, మేజర్ న్యూస్ :** ప్రత్తిపాడు నియోజకవర్గం పెదనందిపాడు మండలం అన్నపర్రు గ్రామంలో బీసీ సంక్షేమ హాస్టల్ లో ఆహార కలుషితం వలన విద్యార్థులకు అనారోగ్యం సంభవించిందని తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా హుటాహుటిన వెళ్లారు. సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారులు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించుటకు చర్యలు చేపట్టారు. విద్యార్థులకు స్థానికంగానే అన్ని సదుపాయాలతో వైద్యం అందించుటకు ఏర్పాట్లు చేశారు. తాగునీటిని పరీక్షించాలని, పారిశుధ్యం, ఆహార పదార్థాలు అన్నిటిని పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని ఆదేశించారు. తక్షణ అన్ని వైద్య ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ఇన్చార్జ్ మంత్రివర్యులు కందుల దుర్గేష్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ అధికారులు వైద్యశాఖ అధికారులు ఏర్పాట్లను చేసి విద్యార్థులకు వైద్య చికిత్సలను అందిస్తున్నారు.

# సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో కవితా సంపుటి పుస్తకావిష్కరణ



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** మంగళగిరి సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ ఆదివారం ఉదయం 9:30 గంటలకు మంగళగిరి గౌతమ బుద్ధ రోడ్ లోని రాయల్ బాంకెట్స్ నందు మూడు దశాబ్దాలుగా మంచి సామాజిక అవగాహనతో నిరంతరం కవిత సేద్యం చేస్తున్న అక్షరకర్షకుడు గోలి మధు రచించిన “ఎదురీత” కవితా సంపుటి, మరో పుస్తకం సాహితీ విమర్శకులు ఏ. రజా హుస్సేన్ కాఫీ విత్ గోలి మధు కవిత్వ విశ్లేషణతో ముద్రించిన పుస్తకం ఆవిష్కరణ జరుగుతాయని మంగళగిరి సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు అన్నారు. గౌతమ బుద్ధ రోడ్ లోని రాయల్ బాంకెట్స్ లో శుక్రవారం జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళగిరి లోని కవులు, రచయితలు, కళాకారులు, కళాభిమానులు, కలలను సాహిత్యాన్ని ప్రోత్సహించే అందరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. ఎదురీత కవితా సంపుటి పుస్తకాన్ని ఆంధ్ర నాటకళా సమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, కాఫీ విత్ గోలి మధు కవిత్వ విశ్లేషణ పుస్తకాన్ని కార్యక్రమ ముఖ్య అతిథి, వెండి,బుల్లితెర గేయ రచయిత మౌని శ్రీమల్లిక్ ఆవిష్కరిస్తారన్నారు. ఎదురీత పుస్తక విశ్లేషణలను అమరావతి సాహితి మిత్రులు డాక్టర్ రావి రంగారావు విశ్లేషణ చేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో మానవ వికాస మండలి అధ్యక్షులు రేఖాకృష్ణార్జునరావు, ఆంధ్ర నాట కళా సమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, విశ్వశాంతి కళాపరిషత్తు అధ్యక్షులు పొట్లాబత్తుని లక్ష్మణరావు, జర్నలిస్టు శిరందాసు నాగార్జున, ఆకురాతి శంకర్రావు, అల్లక తాతారావు, సందుపట్ల భూపతి తదితరులు పాల్గొన్నారు.

# స్విమ్మింగ్ తో శారీరక, మానసిక వికాసం

## – జిల్లా స్థాయి ఈత పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే






**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :**

స్విమ్మింగ్తో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక శ్యామల నగర్ లోని ఎన్టీఆర్ మెమోరియల్ స్విమ్మింగ్ పూల్ లో జిల్లా స్థాయి ఈత పోటీలను ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగుల జీవనంలో వ్యాయామం ఎంతో అవసరం అని తెలిపారు. ప్రస్తుత రోజుల్లో ఉద్యోగాలలో ఒత్తిడి అధికంగా ఉంటుందని, దీన్ని అధిగమించేందుకు వ్యాయామం తప్పనిసరి అని చెప్పారు. ప్రతి ఒక్కరూ రోజులో కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. ఎన్టీఆర్ మెమోరియల్ స్విమ్మింగ్ పూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్నో సంవత్సరాలుగా ఈతల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం జిల్లా స్థాయి పోటీల్లో విజేతలకు మంగళగిరిలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ తల్లిదండ్రులు చిన్నతనం నుంచే పిల్లలకు వారికి ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు.

వ్యాయామం ప్రాధాన్యతను తెలియజేయాలని అన్నారు. అనంతరం సువర్ణ కుటీర్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మర్రి వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని మన జీవితంలో ఆరోగ్యం ఎంత ముఖ్యమని చిన్నపిల్లల నుండి పెద్దవారి వరకు ప్రతి రోజు ఈత నేర్చుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపట్టలో సందేహం లేదన్నారు. ఈత చేయడం ద్వారా మన ఆరోగ్యంలో ఎన్నో మార్పులు వస్తాయని తదనుగుణంగా మన శరీరంలో ఉన్న కొవ్వు వ్యర్థాలను కరిగించి రక్తం సరఫరా చక్కగా గుండెకు అందించేలా శరీర భాగాలు పని చేస్తాయని ఆయన పేర్కొన్నారు. చిన్నవారి నుండి పెద్దవారి వరకు ఈత పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరిని అభినందించారు. ప్రతి ఒక్కరూ ఈత చేయడం ద్వారా ఆరోగ్యాన్ని ఎంతో కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్విమ్మింగ్ పూల్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ మల విసర్జన రహిత పట్టణంగా మంగళగిరి మార్పుకు శ్రీకారం

## – సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేసిన కమిషనర్ అలీం బాషా



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** మంగళగిరి – తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో విస్తృతమైన సర్వే నిర్వహించినట్లు కమిషనర్ అలీబాషా తెలిపారు. ఆ సర్వే ఆధారంగా మొత్తం పట్టణాన్ని తాత్కాలికంగా బహిరంగ మలవిసర్జన రహిత (ఓడిఎఫ్) ప్రాంతముగా ప్రకటించినట్లు చెప్పారు. ఈ తాత్కాలిక స్థితిని శాశ్వతంగా ధృవీకరించుటకు, తుది ధృవీకరణ ప్రక్రియను సులభతరం చేయుటకు, ప్రజా పరిశీలన కొరకు ప్రజల నుండి దీనిపై ఏవైనా అభ్యంతరములు వున్న యెడల వారు ఈ కార్యాలయముకు తెలియపరచుట కొరకు సెప్టెంబర్ 1న ఈ కార్యాలయము నుండి నగర ప్రజలకు, అన్ని ప్రభుత్వ కార్యాలములకు అన్ని వార్డు సచివాలయముల నోటీసు బోర్డు నందు బహిరంగ నోటీసు పొందుపరచి తుది గడువు 14.09.2025న నిర్ణయించినట్లు చెప్పారు. కానీ ఈనెల 8వ తేదీ వరకు నగర ప్రజల నుండి ఎటువంటి ఉల్లంఘనలు/ఫిర్యాదులు అందలేదని తెలిపారు. నగర పాలక సంస్థ ప్రస్తుత చట్టాలు నిబంధనల ప్రకారం మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థను అధికారికంగా శాశ్వతంగా బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతంగా ప్రకటిం చుచున్నామని పేర్కొన్నారు. ఈ విజయవంతమైన సాధనలో భాగస్వాములై సహకరించిన ప్రతి పౌరునికి, నగరపాలక సంస్థ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు కమిషనర్ చెప్పారు.

# దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం





**దుగ్గిరాల మేజర్ న్యూస్ :** దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయం నందు శుక్రవారం సాధారణ సర్వసభ్య సమావేశంను సమావేశమునకు ఎంపీపీ షేక్ జబీన్ అధ్యక్షత వహించగా మండలంలోని సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల అధికారులు ఆయా శాఖల పనితీరును వివరించారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఎం అరుణ, ఏఎంసీ చైర్మన్ ఝాన్సీ రాణి ,వైస్ ఎంపీపీలు పసుపులేటి సాయి చైతన్య ,మరీదు రామయ్య ,ఎంపీడీవో ఏ .శ్రీనివాసరావు ,తాసిల్దార్ ఐ.సునీత, ఎంపిటిసిలు సర్పంచులు ,అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ గా పదవిని పొందిన అశోక్ కుమార్ ను కూటమి నాయకులు అధికారులు. పుష్పగుచ్చాలను అందించి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జిల్లా కలెక్టర్ సే స్వచ్ఛ భారత్ లో అవార్డు పొందిన దుగ్గిరాల గ్రామ సెక్రెటరీ. కె .వివేకానంద ను శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు.

# జిల్లాలో రహదారి ప్రమాదాలు నివారించేందుకు చర్యలు

## – జాతీయ రహదారిపై వాహన ప్రమాదాలను నివారించేందుకు గుర్తించిన బ్లాక్ స్పాట్ లు వద్ద ఇండికేషన్ బోర్డులు ఏర్పాటు



**గుంటూరు, జిల్లా మేజర్ న్యూస్ :** జిల్లాలో రహదారి ప్రమాదాలు నివారించేందుకు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం సంబంధిత శాఖలు సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా , సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలసి జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జాతీయ రహదారి ప్రక్కన వ్యర్థాలు డంపింగ్ చేయకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. రహదారులపై జరుగుతున్న ప్రమాదాల మూల కారణాలు తెలుసుకొని పరిష్కరించేందుకు కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వశాఖ రూపొందించిన ఐ–ఆర్ఏడీ యాప్ లో రవాణా, పోలీస్, రహదారులు, వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రమాదాల వివరాలను, తనిఖీ నివేదికలను ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. దీనిని విశ్లేషించి రహదారులపై ఉన్న బ్లాక్ స్పాట్ లను గుర్తించటంతో పాటు ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. రహదారులపై స్పీడ్ బ్రేకర్లు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం స్కూల్, హస్పిటల్ జోన్లు, బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలన్నారు. అలాగే నగరంలోని మూడు వంతెనల వద్ద, కంకరగుంట ఆర్ యూ బీ వద్ద వర్షం నీరు నిల్వ ఉండకుండా 20 హెచ్ పి మోటార్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని పంపించేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నగరంలోని ప్రదాన రహదారులపై వాహనల పార్కింగ్ కు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ, పంచాయితీరాజ్ రహదారులపై ఉన్న 52 బ్లాక్ స్పాట్ లపై జాయింట్ కమిటీ తనిఖీలో అందించిన సూచన మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై వాహన ప్రమాదాలకు అవకాశం ఉన్న 52 బ్లాక్ స్పాట్స్ గుర్తించడం జరిగిందని , వీటిలో ఇప్పటికే 45 చోట్ల అవసరమైన రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. మిగిలిన ఏడు ప్రదేశాలలో చేపడుతున్న చర్యలపై నివేదిక అందజేయాలని పోలీసు శాఖాధికారులకు తెలిపారు. రహదారి ప్రమాదాల వివరాలను ఐఆర్ఏడీ యాప్ లో సంబంధిత శాఖలు జాతీయ రహదారి సమీపంలోని ట్రామా కేర్ హాస్పిటల్స్ లో రహదారి ప్రమాదంలో గాయపడిన వారికి సత్వరమే చికిత్స అందించేలా డీఎంహెచ్ఓ ఆస్పత్రి నిర్వహకులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ప్రమాదానికి గురైన వారు ఎంత మంది ఎన్ టీ ఆర్ వైద్య సేవలు క్రింద చికిత్స పొందుతున్నారు అని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీనివాస మూర్తి, జిల్లా ఉప రవాణ కమిషనర్ సీతారామిరెడ్డి, జాతీయ రహదారుల అధికారులు , వైద్య ఆరోగ్య, ఎక్సైజ్ , నగరపాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కెఎల్ యులో ఘనంగా ప్రారంభమైన సమ్యక్ 2025 వేడుకలు

**మంగళగిరి, మేజర్ న్యూస్ :** వడ్డేశ్వరం కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో జాతీయ స్థాయి టెక్నో-మేనేజ్‌మెంట్ ఫెస్ట్ సమ్యక్-2025 ని నిర్వహిస్తుందని వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ తెలిపారు. ఈ ఉత్సవానికి రాష్ట్ర క్రీడల అథారిటీ చైర్మన్ అనిమిని రవి నాయుడు ముఖ్య అతిథిగా హాజరై శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వాస్తవ ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనే జాతీయ స్థాయి వేదికను సృష్టించినందుకు కెఎల్ విశ్వవిద్యాలయాన్ని ప్రశంసించారు. విద్యార్థులు అనుకూలమైన, సరసమైన, స్కేలబుల్ పరిష్కారాలను నిర్మించాలని కోరారు. ప్రముఖులు ఉత్సవ సావనీర్‌ను విడుదల చేసి, కార్యక్రమాల అమలుకు వారి సహకారానికి కోఆర్డినేటర్లు, వాలంటీర్లకు గుర్తింపులను అందజేశారు. ఎపి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన క్వాంటం మిషన్, ఎఐ ఇంపెటస్, ఉపాధి కల్పనపై దృష్టి సారించిన ముఖ్యాంశాలు, ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడి విజన్ , కెఎల్ విశ్వవిద్యాలయం యొక్క సారూప్య దృక్పథం ఒకదానికొకటి సరిపోయే విధంగా ఉన్నాయన్నారు. క్రీడల చొరవలలో వర్శిటీ ప్రయత్నాలకు సాప్ ద్వారా కెల్ యూ విశ్వవిద్యాలయానికి మద్దతును కూడా అందించారు. ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్‌లో విద్యార్దులు ప్రదర్శించిన ప్రతిభ, నైపుణ్యాలను ప్రశంసించారు. యువ విద్యార్థులు, భవిష్యత్తు నైపుణ్యాలను మెరుగుపరుచుకునే ఆవశ్యకత గురించి వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ జీ యొక్క వికాసిత్ భారత్ విజన్ 2047 ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు యొక్క స్వర్ణ ఆంధ్రప్రదేశ్ విజన్, ఎఐ జెన్ యుగంలో ఊహించలేని అనేక అవకాశాల కోసం మార్గం సుగమం చేస్తాయని, ఎపి ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు రాబోయే సంవత్సరాల్లో ఈ విజయవంతమైన విజన్ ప్లాన్‌లో భాగస్వామ్యమయ్యే వారు విద్యార్థులందరూ అత్యాధునిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని, ఎఐ, విఎల్ ఎస్ఐ , రోబోటిక్స్ , డ్రోన్ టెక్నాలజీస్ , హైడ్రోఫోనిక్స్ మొదలైన అన్ని సాంకేతికతలతో పాటు వారిని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రోజంతా వర్శిటీ ప్రాంగణం విద్యార్దులతో నిండిపోయింది. దీంతో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థుల భాగస్వామ్యంతో జాతీయ టెక్నో-మేనేజ్‌మెంట్ ఫెస్ట్ ఘనంగా జరిగింది. వర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో-వైస్-ఛాన్సలర్ డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్, సమ్యక్ చైర్మన్ డాక్టర్ కె. రాజశేఖర్ రావు, డాక్టర్ ఎ. శ్రీనాథ్, డాక్టర్ మాధవ్, కన్వీనర్లు డాక్టర్ వి. రాజేష్, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ ఎం. కిషోర్ బాబుతో పాటు ఇతర సీనియర్ నిర్వాహకులు, పరిశ్రమ నిపుణులు, విద్యార్థి నాయకులు హాజరయ్యారు. అనంతరం యూనివర్సిటీ ప్రొ వైస్ ఛాన్సలర్లు డాక్టర్ కె రాజశేఖరరావు, డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.





సుబ్బారావు, సమ్యక్ చైర్మన్లు కలిసి ముఖ్య అతిథి అనిమి రవి నాయుడిని ఘనంగా సత్కరించారు. యూనివర్సిటీ క్యాంపస్ లో జరుగుతున్న ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్, స్టాల్స్ , వివిధ కార్యక్రమాలను చూసేందుకు తోడుగా నడిచారు. సమ్యక్ 2025లో ఎపి, టిఎస్ ఇతర భారతీయ రాష్ట్రాల నుండి మొత్తం 25 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్ ఎక్స్ పో ఎఐ, ఎంఎల్, మొబిలిటీ, హెల్త్-టెక్, అగ్రి-టెక్, స్థిరత్వం, ఎంబెడెడ్ సిస్టమ్‌లలో 450 పైగా విద్యార్థుల ఆవిష్కరణలు ప్రదర్శనలో ఉన్నాయి. పరిశోధన



పత్రాలు, పోస్టర్లు, సమస్య-ఆధారిత అధ్యయనాలు, నమూనాలను ప్రదర్శించే వర్ధమాన పరిశోధకుల 3 వేల కంటే పైగా ప్రదర్శనలను విద్యార్దులు పకనదర్శనలను ప్రదర్శించారు. వర్క్ షాప్‌లు, కార్యక్రమాలు అత్యాధునిక సాధనాలు, ఫ్రేమ్‌వర్క్ లు, కెరీర్ నైపుణ్యాలపై పరిశ్రమ మార్గదర్శకులు, అధ్యాపకులు నిర్వహించిన 256 పైగా ఆచరణాత్మక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ డాక్టర్ పార్ధ సారధివర్మ మాట్లాడుతూ అనుభవపూర్వక ఫలితాల ఆధారిత అభ్యాసంపై విశ్వవిద్యాలయం దృష్టిని హైలైట్ చేయగా, ప్రో-వైస్ చాన్సులర్ డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్ ప్రాంగణ విద్యాభ్యాసాన్ని పరిశ్రమల అంచనాలతో అనుసంధానించడంలో సమ్యక్ పాత్రను నొక్కిచెప్పారు. జాతీయ నైపుణ్య ప్రాధాన్యతలతో ఈ ఉత్సవం యొక్క సమలేఖనాన్ని డాక్టర్ కె. రాజశేఖర్ రావు నొక్కి చెప్పారు. సమ్యక్ ఛైర్మన్ డాక్టర్ ఎ. శ్రీనాథ్ బహుళ వేదికలలో సజావుగా నిర్వహించినందుకు భాగస్వామ్య సంస్థలు, అధ్యాపకులు, వేలాది మంది విద్యార్థి వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. రోజంతా, కారిడార్లు, మైదానాలు ప్రత్యక్ష ప్రదర్శనలు, ప్రోటోటైప్ పరీక్ష, హ్యాక్-స్టాల్స్ , పీర్ సమీక్షలతో నిండిపోయాయి. నిపుణుల జ్యూరీలు కొత్తదనం, సాంకేతిక లోతు, వినియోగదారుల ప్రభావం, స్కేల బిలిటీపై ప్రదర్శనలను మూల్యాంకనం చేయగా, వర్క్ షాప్‌లు జెనరేటివ్ ఎఐ, క్లౌడ్, డెవ్ఆప్స్, సైబర్ సెక్యూరిటీ, డిజైన్ థింకింగ్, రోబోటిక్స్, ఎఆర్, విఆర్, డేటా ఇంజనీరింగ్‌పై కార్యక్రమాలతో వర్శిటీలోని హాళ్లన్నీ నిండిపోయాయి.





## మండల పరిషత్ కార్యాలయంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై అవగాహన

**దుగ్గిరాల ,మేజర్ న్యూస్ :** దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయం లో శుక్రవారం సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ పై అవగాహన కార్యక్రమం ను నిర్వహించారు . ఈ సందర్భంగా ప్రత్యేకంగా . ఏర్పాటు. చేసిన ఎగ్జిబిషన్ ను. అధికారులు ప్రజా ప్రతినిధులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు . ఆటో ద్విచక్ర వాహనాలు ,గృహ పరికరాలు, ఎలక్ట్రానిక్స్ ,మందులు ,తినుబండారాలు తదితర వాటిని స్టాల్స్ లో ఏర్పాటు చేసి వాటిపై అవగాహన కల్పించారు .కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ షేక్. జబీన్ పార్టీ అధ్యక్షురాలు కే . శ్రీ అనిత ఏఎంసి చైర్మన్ ఝాన్సీ రాణి జన సేన అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, ఏ. వెంకటరావు ,కూటమి నాయకులు, మండల అధికారులు కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సేల్స్ అసిస్టెంట్ కమిషనర్ జి. శ్రీనివాసరావు ,ఎంపీడీవో ఏ. శ్రీనివాసరావు ,డిప్యూటీ ఎంపీడీవో కేజే నెహ్రూ ,రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటరావు ,మాజీ ఎంపీపీ వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్ బిజెపి రాష్ట్ర మాజీ జిల్లా కార్యదర్శి ,చుండూరు ఉమామహేశ్వరరావు కార్యాలయ ఏవో చంద్రమోహన్, పంచాయతీ కార్యదర్శి కె. వివేకానంద, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు, మహిళలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు త్వరగా కోలుకోవాలి

**ప్రత్తిపాడు, మేజర్ న్యూస్ :**

అస్వస్థతకు గురయిన విద్యార్థులను పలువురు నాయకులు పరామర్శించి దైర్యం చెప్పారు. శుక్రవారం సాయంత్రం ఆర్యవైశ్య కల్యాణ మండపం లో చికిత్స తీసుకుంటున్న విద్యార్థులను ప్రత్తిపాడు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ పరామర్శించి కారణాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా బలసాని కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యం తో మెడికల్ కళాశాల లు నిర్మిస్తే కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత మెడికల్ కళాశాలను అమ్ముకుంటున్నారని, పేదల కు వైద్యం అందకుండా చేస్తున్నారని కూటమి ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయన వెంట దారం అశోక్, కల్లూరి నాగేశ్వరరావు, షేక్ యాసిన్ పీరా, మెట్టు వెంకటప్పారెడ్డి, గేరా గణేష్, కారుమూరి ఇంద్ర, తదితరులు ఉన్నారు.

**బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పరామర్శ :**

అస్వస్థతకు గురయిన విద్యార్థులను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు విజ్ఞప్తి చేశారు. అయన వెంట యువజన విభాగం అధ్యక్షులు కుమ్మరి క్రాంతికుమార్, చల్లా హనుమంతు, దారం అశోక్ యాదవ్, రాజు తదితరులు ఉన్నారు.






## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ స్థానిక టీడీపీ నాయకులతో కలిసి బాధితులకు అందజేశారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి పెదవడ్లపూడిలో అనారోగ్యంతో బాధపడుతున్న పోతురాజు పార్వతి కి రూ. 1,21,226, సయ్యద్ నూర్జకు రూ. 25,541, లింగినేని నందినికి రూ. 20,464, పరుచూరి పద్మావతికి రూ. 45వేలు, షేక్ జాన్ బాషాకు రూ. 77,063 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మొత్తం ఐదుగురికి రూ. 2,89,294 విలువైన చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులు రావడానికి కృషిచేసిన మంత్రి నారా లోకేష్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు మాదల రమేష్ బాబు, నడపన దుర్గారావు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, ఉల్లంగి శ్రీనివాసరావు,కంచర్ల బద్రి, శరణు విష్ణు, కొప్పాక ఓంకార్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

**ఉండవల్లి లో... :** అనారోగ్యంతో బాధపడుతున్న మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి ఉండవల్లికి చెందిన బాలసాది కౌశిక్ గుణ కు మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 2. 50 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) ముంజురైంది. బాధితుని ఇంటికి వెళ్ళి చెక్కును అందజేశారు. ఎల్వోసీ చెక్కు రావడానికి కృషి చేసిన మంత్రి నారా లోకేష్ కు కౌశిక్ గుణ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. చెక్కుని అందజేసిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు దాసరి కృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షులు వంగా నరేంద్ర,రాష్ట్ర యస్సీ సెల్ నాయకులు దోప్పలపూడి జ్యోతిబసు, మౌనిక, సీత తదితరులు ఉన్నారు.



# పౌష్టికాహారం అందించడమే లక్ష్యం



**పెదకూరపాడు మేజర్ న్యూస్:** పౌష్టికాహారం అందించడమే పోషణ మాసోత్సవ లక్ష్యమని ఐసిడిఎస్ సిడిపిఓ వెంకటరమణ తెలిపారు. పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ పోషణ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఊబకాయం తగ్గించటం, పుట్టిన పిల్లలకు వెయ్యి రోజులు తల్లిపాలు, పోషకాహారం అందించటం పాటు పెంచవలసిన బాధ్యత గురించి ఆమె వివరించారు. తహసిల్దార్ ధనలక్ష్మి, ఎంపీడీవో సాయి లీల, ఎంఈఓ ప్రసాదరావు, సత్యనారాయణ, ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అత్త దేవమ్మ , పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు , మాజీ ఎంపీటీసీ ముంతాజ్ , డ్వాక్రా యానిమేటర్ కావూరు సుజాత,సూపర్వైజర్లు ఇమంబి, మాధవి, జడ్పీహెచ్ స్కూల్ హెడ్మాస్టర్ రమణ మండల అంగన్వాడీ కార్యకర్తలు మరియు గర్భిణీలు ఆడపిల్ల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పంట రుణాలు ఇవ్వాలంటూ కౌలు రైతులు ధర్నా




**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** దుగ్గిరాలమండల పరిధిలోని చిలువూరు యూనియన్ బ్యాంకు వద్ద పంట రుణాలను అందించాలంటూ కౌలు రైతులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు మాట్లాడుతూ సిసిఆర్సి కార్డు ఉన్న ప్రతి కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారము రెండు లక్షలు రూపాయలు ఏ విధమైన షూరిటీ లేకుండా మంజూరు చేయా లని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం. నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ కౌలు కార్డు లేని రైతులకు ,ఈక్రాప్ చేసిన వారికి జేఎల్జే గ్రూపుల ద్వారా రుణాలు అందివాలని డిమాండ్. చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు. జెట్టి. బాలరాజు ,ఎం అంజయ్య , ఇస్మాయిల్ ఖాన్ ఎన్ నాగేంద్రం , దేవినేని బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# నరసరావుపేటలో 'సూపర్ జిఎస్టి - సూపర్ సేవింగ్స్



**నరసరావు పేట మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన 'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్' అవగాహన కార్యక్రమంలో భాగంగా నరసరావు పేట మున్సిపల్ హైస్కూల్‌లో ఎగ్జిబిషన్ సేల్స్‌ను శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ జీఎస్టీ 2.0 సంస్కరణల ప్రయోజనాలు, ప్రత్యేకించి ఎలక్ట్రానిక్ వస్తువులపై తగ్గిన పన్ను రేట్లు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణల లబ్ధాలను ప్రతి ఇంటి దాటిపొందేలా చేయడానికి రూపొందించబడింది. సోనోవిజన్ ఎలక్ట్రానిక్స్, విజేత ఎలక్ట్రానిక్స్, ఆర్‌ఆర్ డిజిటల్ అండ్ ఫర్నిచర్స్ వంటి స్థానిక వ్యాపారులు తమ ప్రొడక్ట్‌లను ప్రదర్శించారు. టీవీలు, ఫ్యాన్స్‌లు, రిఫ్రిజిరేటర్లు, డిజిటల్ గాడ్జెట్‌లు, ఫర్నిచర్ వంటి వస్తువులు ఎగ్జిబిషన్‌లో ఆకర్షణీయంగా ఏర్పాటు చేయబడ్డాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు మాట్లాడుతూ జిఎస్టి 2.0 సంస్కరణల ద్వారా ఎలక్ట్రానిక్ వస్తువులపై పన్ను రేట్లు గణనీయంగా తగ్గాయి. గతంలో 18% నుంచి 28% వరకు ఉండేవి, ఇప్పుడు చాలా వస్తువులకు 5% నుంచి 12% వరకు మాత్రమే వర్తిస్తున్నాయి. ఉదాహరణకు మొబైల్ ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లపై 18% జీఎస్టీ ఉండగా, ఇప్పుడు 12%కి తగ్గింది. టీవీలు, రిఫ్రిజిరేటర్ల వంటి లార్జ్ అప్లయన్స్‌లపై 28% నుంచి 18%కి, చిన్న అప్లయన్స్‌లపై 12% నుంచి 5%కి డౌన్ అయింది. ఈ తగ్గింపులు వినియోగదారులకు రూ. 5,000 నుంచి రూ. 20,000 వరకు సేవింగ్స్ చేస్తాయి. విద్యార్థులు, పౌరులు ఈ ప్రయోజనాలను పూర్తిగా అనుభవించాలి అని వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు విద్యార్థులతో మాట్లాడి, జీఎస్టీ బిల్లులు చూసి పన్ను తగ్గింపులు ఎలా ప్రభావితం చేస్తాయో ప్రాక్టికల్‌గా చూపించారు. ఈ కార్యక్రమం ద్వారా స్థానిక వ్యాపారులు తమ ప్రొడక్ట్‌లను తక్కువ ధరలకు అమ్ముతూ జీఎస్టీ2.0 ప్రయోజనాలను ప్రజలకు అందజేస్తున్నారు. నరసరావు పేటలో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని ప్రాంతాలకు విస్తరించాలని ఎమ్మెల్యేలు సూచించారు.

# సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరుస్తుంది

### – హైకోర్టు మాజీ న్యాయమూర్తి రజిని



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం అమలుకు 20 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధి చినకాకాని వద్ద గల సమాచార శాఖ కమిషన్ కార్యాలయంలో శుక్రవారం ఆర్‌టీఐ వారం వేడుకలను ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిపుణులు, ప్రముఖులు, అధికారులు పాల్గొని దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, బాధ్యత, ప్రజాపాలనను బలపరిచే ఆర్‌టీఐ చట్టం ప్రాముఖ్యతపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి రజిని ఆర్‌టీఐ చట్టం రూపొందడానికి దారితీసిన కారణాలు ఆ చట్టం ఆధారమైన సూత్రాలపై స్పష్టతనిచ్చే శక్తివంతమైన ప్రసంగం చేశారు. ఆర్‌టీఐ చట్టం రూపకల్పనకు ప్రధాన ప్రేరణగా నిలిచిన సామాజిక కార్యకర్త అరుణా రాయ్ పాత్రను ఆమె ప్రశంసించారు. సమాచార హక్కు వంటి చట్టాలు ప్రజలకు ప్రభుత్వంపై జవాబుదారీతనం కల్పిస్తాయని, ఇది ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరుస్తుందని తెలిపారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ప్రకారం భావ వ్యక్తీకరణ స్వేచ్ఛతో పాటు సమాచార హక్కు కూడా ప్రతి పౌరునికి ఉన్న మౌలిక హక్కు అని గుర్తుచేశారు. అదే విధంగా, ప్రజల ఫిర్యాదులను పరిష్కరించడంలో, ప్రజా అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంలో శ్రమిస్తున్న ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ సిబ్బందిని ఆమె అభినందించారు.

కార్యక్రమంలో మాజీ సమాచార కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డి పాల్గొని కమిషన్ పని తీరును మరింత సమర్థవంతంగా మార్చేందుకు విలువైన సూచనలు అందించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించడం ద్వారా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం అత్యవసరమని ఆయన సూచించారు. సమాచార కమిషనర్ పి. శామ్యూల్ జోనథన్ , ప్రస్తుత సమాచార కమిషన్ విధానాలను సులభతరం చేయడానికి తాను చేపట్టిన చర్యలను వివరించారు. ఆయన మాట్లాడుతూ, కేంద్ర సమాచార కమిషన్‌లో మాజీ కమిషనర్ హీరలాల్ సమారియా అమలు చేసిన ఉత్తమ పద్ధతులను ఆంధ్రప్రదేశ్ కమిషన్‌లో కూడా అమలు చేస్తానని, సాధ్యమైనంత వంకు అదే రోజు కేసు పరిష్కారం చేసే విధానం అమలు చేస్తానని తెలిపారు. సమాచార శాఖ మరో కమిషనర్ డా. చావలి సునీల్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విస్తృత అవగాహన కార్యక్రమాల గురించి వివరించారు. ఇప్పటివరకు 900కు పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, లక్షకు పైగా పౌరులకు సమాచార హక్కు ప్రాముఖ్యతను వివరించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాలను మరింత విస్తరించి, ఆర్‌టీఐ సందేశం ప్రతి గ్రామానికి చేరేలా కృషి చేస్తానని చెప్పారు. డా. చావలి సునీల్ తన తీర్పుల ద్వారా వేలాది మంది పౌరులకు న్యాయం చేకూరిందని పేర్కొన్నారు.

తన సేవా తత్వాన్ని ఇలా వివరించారు. ఆర్‌టీఐ వారం వేడుకలు గత 20 సంవత్సరాల ఆర్‌టీఐ ప్రయాణాన్ని స్మరించుకోవటానికి మాత్రమే కాకుండా, భవిష్యత్తులో పారదర్శకత, సులభతరత ప్రజా సాధికారత పట్ల కమిషన్ యొక్క అంకితభావాన్ని మరొక్కసారి ప్రతిబింబించాయి. సమాచార శాఖ కమిషన్ కు వచ్చి న్యాయం పొందిన వారి ప్రస్థానాన్ని వివరించారు. కార్యక్రమంలో బ్రోచర్ ఆవిష్కరించారు.

# కలెక్టర్ ను కలిసిన మాల మహానాడు జాతీయ,రాష్ట్ర నేతలు



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** శుక్రవారం స్థానిక నరసరావుపేట పట్టణ కేంద్రంలో కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల ని మర్యాదపూర్వకంగా కలిసి, ఈ పల్నాడు జిల్లాకు మొట్టమొదటి మహిళ కలెక్టర్ గా బాధ్యతలు వహిస్తున్న కృతిక శుక్లా మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ళ అరుణ్ కుమార్ రాష్ట్ర అధ్యక్షులు డా గోదా జాన్ పాల్ వారి కమిటీ తో కలిసి అభినందనలు తెలియజేశారు, అనంతరం మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే డాఎంచదలవాడ అరవింద్ బాబు దృష్టికి కూడా బాపనయ్య నగర్ వాసులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని అలాగే మున్సిపల్ మరియు రెవెన్యూ అధికారుల్ని కలిసి విన్నవించినట్లు గత 35 సంవత్సరాల పైబడి నివాసం ఉంటున్న బాపనయ్య నగర్ లో పేదలకు ఇప్పటికైనా హక్కులు కల్పించాలని అక్కడ నివసిస్తున్న వారంతా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని ఇళ్ల పట్టాలు మంజూరు కొరకు మున్సిపల్ ప్రభుత్వ కార్యదర్శి నీ కూడా కలిసి విషయం తెలియజేశామని వివరించగా కలెక్టర్ స్పందించి కచ్చితంగా తక్కువ సమయంలో అక్కడున్న వారంతా ఆన్లైన్లో అప్లికేషన్ పెట్టుకునే అవకాశాన్ని కల్పిస్తానని హక్కులు కల్పిస్తానని హామీ ఇవ్వడం జరిగింది కలెక్టర్ ని కలిసిన వారిలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ళ అరుణ్ కుమార్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్ పాల్, నరసరావుపేట నియోజకవర్గం వర్కింగ్ అధ్యక్షులు విస్తాల జయరావు, సత్తెనపల్లి నియోజకవర్గ ఉద్యోగ సంఘాల అధ్యక్షులు మాలే మరియదాసు, గోదా నీలాంబరం,ముప్పాళ్ళ మండల అధ్యక్షులు సేవా చంద్ర,కొండా ప్రకాష్,జెర్రీ పోతు లోకేష్, తాత పూడి మల్లయ్య,కంచెర్ల రాజు తదితరులు ఉన్నారు.

# కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరణ

**గుంటూరు రూరల్ మేజర్ న్యూస్ :** ఏటుకూరు బైపాస్ రోడ్డులో ప్రత్తిపాడు నియోజకవర్గ వై. యస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జరిగింది. మాజీ ముఖ్యమంత్రి వై. యస్. ఆర్ సీ.పీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ పోస్టర్ ను పత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జి బలసాని కిరణ్ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వై. యస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే డా.చదలవాడ



**నరసరావు పేట మేజర్ న్యూస్ :**
నరసరావు పేట నియోజకవర్గం శాసనసభ్యులు డా"చదలవాడ అరవింద బాబు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును నరసరావు పేట ఆర్యవైశ్య ప్రముఖులు నాగసరపు సుబ్బరాయ గుప్తా కపిలవాయి విజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు నవంబర్ నెలలో విజయవాడలో జరగబోయే జ్యుయలరీ ఎగ్జిబిషన్ పోస్టర్ ను ఆవిష్కరించారు ఎమ్మెల్యే డా. చదలవాడ నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలను ముఖ్యమంత్రికి వివరించారు.

# మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ (ఎం.ఎస్.యూ.) ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని:పులి శ్రీనివాసులు



**గుంటూరు మేజర్ న్యూస్ :** ప్రదానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లో భాగంగా గుంటూరు నగరానికి మంజురైన ప్రతిష్టాత్మక మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ (ఎం. ఎస్. యూ. ) ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఎం. ఎస్. యూ. ప్రతినిధులను కోరారు. శుక్రవారం స్థానిక మెడికల్ కాలేజిలో మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ ఏర్పాటు పనులను పరిశీలనకు డిల్లీ నుండి వచ్చిన ఎం. ఎస్. యూ. బృందం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో కమిషనర్ తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అత్యున్నత ప్రమాణాలు, నాణ్యతతో కూడిన వైద్య పరీక్షలు చేయడానికి వీలుగా గుంటూరు నగరంలో మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, సదరు యూనిట్ ఏర్పాటు పనులను వేగంగా జరిగేల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యూనిట్ పనుల పురోగతిపై పరిశీలనకు వచ్చిన ఎం. ఎస్. యూ. బృందం కూడా తాము చేపట్టాల్సిన సాంకేతిక పనులను వేగంగా చేపట్టాలని కోరారు. సమావేశంలో ఎం. ఎస్. యూ సంయుక్త డైరెక్టర్ డాక్టర్ ప్రణయ్ వర్మ, వై. శ్రీను, డాక్టర్ సత్యమ్ సిల్, జిఎంసి ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారయణ పాల్గొన్నారు.

# స్విమ్మింగ్ పోటీ విజేతలకు బహుమతులు అందజేసిన మన్నవ



**గుంటూరు, మేజర్ న్యూస్ :** గుంటూరు శ్యామలానగర్లోని ఎన్టీఆర్ మున్సిపల్ పార్క్ లో ఏపీ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 8వ మాస్టర్స్ ఇంటర్ స్టేట్ స్విమ్మింగ్ పోటీలలో విజేతలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ శుక్రవారం మెడల్స్ , సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ... వయసుతో సంబంధం లేకుండా స్విమ్మింగ్ లో పాల్గొన్న ప్రతిఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. స్విమ్మింగ్ అనేది ఒక పోటీలా కాకుండా మానసికంగా, శారీరకంగా ఎన్నోలాభాలతో కూడిన ఒక వ్యాయామం లాంటిదని మన్నవ మోహనకృష్ణ అన్నారు. ఇంతమంచి కార్యక్రమాన్ని నిర్వహించిన అసోసియేషన్ సభ్యులు సత్యనారాయణ , నల్లబోతు అఖిల్ , పులుకూరి వెంకట్రావు గ మిగిలిన సభ్యులును మన్నవ మోహన కృష్ణ అభినందించారు.

# సమస్యలకు పరిష్కారం చూపాలి

**– ఎమ్మెల్యే కన్నాకు వినతిపత్రం అందించిన సచివాలయ ఉద్యోగులు**



**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** గ్రామ వార్డు సచివాలయా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపించాలని మాజీ మంత్రివర్యులు,శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణకు గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు వినతి పత్రం అందజేసారు . శుక్రవారంపట్టణంలోని రఘురాం నగర్ నందు గల టిడిపి కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో పాల్గొన్న సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ వారికి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపించాలని వినతిపత్రం అందించి వారి సమస్యలను వివరించారు. గ్రామవార్డు నచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్ కాలమునకు సంబంధించిన 2 నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని మనవి చేశారు. ప్రొబేషన్ ఆలస్యం అవ్వడం చేత గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులుకోల్పోయిన 9 నెలలకు సంబంధించిన బకాయిలు విడుదల చేయాలన్నారు. ప్రమోషన్ లేకుండా ఒకే క్యాడర్లో 6 సం? లకు నర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీమ్ (AAS) క్రింద ఒక స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ను మంజూరు చేయాలన్నారు. ఇంటింటికి తిరిగి చేసే సేవలు మరియు సర్వేల నుండి పూర్తిగా విముక్తి కల్పించాలనీ చాలా అన్నారు. ఈ కార్యక్రమములో సత్తెనపల్లి పట్టణానికి చెందిన గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు చిలుక ప్రదీప్, ప్రధాన కార్యదర్శి మువ్వల గౌతమి, పల్నాడు జిల్లా మహిళా పోలీసు అధ్యక్షులు దామరల నళిని , వీఆర్ ఓ అరుణ , రవి, రాజు,రెబరపు సురేష్ , నాగలక్ష్మి , నరసింహా, అనంత్ ,వెంకటేష్ ,నందిని ,సాంబశివరావు,వెంకట్ నారాయణ,వినోథ్, సచివాలయంకార్యదర్శులు సిబ్బంది తదితరులుపాల్గొన్నారు

# బిస్కెట్లు పండ్లు పంపిణీ



**గురజాల మేజర్ న్యూస్ :** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురజాల మండల న్యాయ సాధికార సంస్థ ఆధ్వర్యంలో గురజాల హైస్కూల్ నందు నిర్వహిం చబడుతున్న భవిత మానసిక దివ్యంగుల పాఠశాల ఏర్పాటు చేయబడిన కార్యక్రమం లో గురజాల సీనియర్ సివిల్ జడ్జి శ్రీ యలమంచిలి శ్రీనివాస్ రావు గారు హాజరై సంబందించిన చట్టాల పై మాట్లాడి, స్కూల్ నిర్వహణ, అవసరత ల గురించి తెలుసు కొని, వీల్ చైర్స్ మరియు వినికిడి యంత్రంపరికరాలు వచ్చే విదంగా సంబంధిత అధికారులకు సూచన జరిచేయటం జరిగింది ఈ కార్యక్రమం లో గురజాల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చీతిరాల కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కత్తి చలమరాజు, సీనియర్ న్యాయవాది sk జానిభాష మరియు న్యాయ సేవధికారాసంస్థ సిబ్బంది, స్కూల్ ఉపాధ్యాయ మరియు సిబ్బంది పాల్గొన్నారు విద్యార్థుల కు బిస్కెట్ లు, పండ్లు పంచి పెట్టారు.

# క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

**– ఉగ్గిరాల సీతారామయ్య**



**గుంటూరు రూరల్ మేజర్ న్యూస్ :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు, ఏటుకూరు గ్రామ మాజీ సర్పంచ్ ఉగ్గిరాల సీతారామయ్య కోరారు. ఈనెల 09, 10 తేదీలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలు ఏటుకూరు జిల్లా పరిషత్ హై స్కూల్లో నిర్వహించారు. చివరి రోజు జరిగిన బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమానికి సీతారామయ్య ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో 16వ వార్డు కార్పొరేటర్ దాసరి లక్ష్మీ దుర్గ, ప్రధానోపాధ్యాయురాలు వై. వాణి ఎస్ జి ఎఫ్ మం డల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఎస్. రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయుల విద్యార్థులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రేమ్ జ్యోతి బాబు జన్మదిన వేడుకలు



**గుంటూరు, విద్య మేజర్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం సాయంత్రం ముద్దు. ప్రేమ్ జ్యోతి బాబు. జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా. కేక్ కటింగ్ చేశారు. ముఖ్య అతిథిగా మాజీ జిల్లా గ్రంధాల చైర్మన్. బత్తుల దేవానంద్.,వి సి కె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు. నక్క విద్యాసాగర్, పాల్గొని ప్రసంగించారు. భీమ్ సేన్ సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లపు నీలాంబరం, రాష్ట్ర మాల మహానాడు ప్రధాన కార్యదర్శి బత్తుల అనిల్.,భారత్ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంచి ర్యాల జోసెఫ్, భీమ్ భారత్ నగర మహిళా నాయకురాలు రావినూతల కమల కుమారి, ఎన్జీవో నాయకురాలు రత్నశ్రీ,భీం సేన సేవా దళ్ రాష్ట్ర కార్యదర్శి కొప్పుల సురేష్,జిల్లా కార్యదర్శి దార్ల అర్జున్,నగర అధ్యక్షుడు మక్కిన లక్ష్మయ్య, బద్రీనాథ్, కారం శెట్టి గోపి, డాక్టర్ ఎండ్రాపాటి సాంబశివరావు,డాక్టర్ కొండలరావు . స్పోక్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు బండ్లమూడి స్టాలిన్ బాబు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యామర్తి రాజు, దుశాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మోపతి శ్రీనివాసరావు, గోవింద్. (గాబ్రియల్ ) ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. బడుగు రత్నం యునెస్కో రాష్ట్ర అధ్యక్షులు చర్వాక,యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు. చిన్నం డేవిడ్ విలియమ్స్ వందన సమర్పణ చేశారు..

# అన్నా క్యాంటీన్లలో మౌలిక వసతులపై పర్యవేక్షణ



**గుంటూరు మేజర్ న్యూస్ :** నగరపాలక సంస్థ పరిధిలోని అన్న క్యాంటీన్లలో మౌలిక వసతులపై ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అక్షయ పాత్ర సిబ్బందికి తెలిపారు. శుక్రవారం మిర్చి యార్డ్ దగ్గరలోని అన్న క్యాంటీన్ని కమిషనర్ పరిశీలించి, ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, మిర్చి యార్డ్ దగ్గరలోని అన్న క్యాంటీన్ లో ఫ్లేవర్డ్ బ్లాక్స్ కుంగాయని, వాటిని వెంటనే సరి చేయాలని ఏఈని ఆదేశించారు. అక్షయ పాత్ర సిబ్బంది ఎప్పటికప్పుడు మౌలిక వసతులపై జిఎంసి నోడల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే సచివాలయ కార్య దర్శులను షిఫ్ట్ ల వారిగా పర్యవేక్షణ కోసం విధులు కేటాయించామని తెలిపారు.

# సవితమ్మకు హాట్సాఫ్

- విజయవాడ – గుంటూరు రహదారిపై రోడ్డు ప్రమాదం
- రోడ్డు ప్రమాద బాధితుడికి సపర్యాలు చేసిన మంత్రి
- తన ఎస్కార్ట్ వాహనం ద్వారా ఆసుపత్రికి తరలింపు
- మంత్రి సవిత స్పందించిన తీరుపై ప్రశంసల వెల్లువ



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత మరోసారి తన మానవత్వాన్ని చూపారు. అధికార దర్పం కంటే ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే ఆమెకు అలవాటుగా మారింది. రోడ్డుపై ప్రమాదానికి గురై నిస్సహాయస్థితిలో పడివున్న వృద్ధుని లేపి, సపర్యాలు చేశారు. తన కాన్వాయ్ లోని వాహనంలోకి ఎక్కించి సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ దృశ్యాన్ని చూసిన వాహనదారులు, పాదాచారులు మంత్రి సవిత మానవత్వాన్ని కొనియాడారు. శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో విజయవాడలో గాంధీ శిల్ప బజార్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించి, తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయానికి మంత్రి సవిత బయలుదేరారు. క్యాంపు కార్యాలయం సమీపంలోకి రాగానే విజయవాడ–గుంటూరు హైవేపై వడ్డేశ్వరం వైపు ద్విచక్ర వాహనంపై వృద్ధుడు వెలుతున్నాడు. తీవ్ర అనారోగ్యంతో వృద్ధుడు వెలుతున్న వాహనంపై నుంచి రోడ్డుపై పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అదే సమయంలో అటుగా వెలుతున్న మంత్రి సవిత... తన కాన్వాయ్ ను ఆపి, వృద్ధుడికి నీరు తాగించి సపర్యాలు చేశారు. 108 వాహనం వచ్చే వరకూ ఆగకుండా, కొద్దిగా తేరుకున్న వృద్ధుడిని తన ఎస్కార్ట్ వాహనంలో సమీపంలో ఉన్న ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. హైపై ప్రమాదం చోటుచేసుకోవడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎటువంటి అధికార దర్పం చూపకుండా మంత్రి సవిత స్పందించిన తీరు చూసి వాహనదారులు, పాదాచారులు కొనియాడారు. గతంలోనూ ఇదే రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం లోనూ మంత్రి సవిత స్పందించిన తీరును గుర్తు చేస్తూ ప్రశంసలు కురిపించారు.

# ఉప్పలపాడులో గల అర్బన్ హౌస్ లే అవుట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్లు



**పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** నరసరావుపేట మండలం, ఉప్పలపాడు లో గల అర్బన్ హౌసింగ్ లేఅవుట్ ను జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, నరస రావుపేట శాసనసభ్యులు సభ్యులు చదలవాడ అరవింద్ బాబు పరిశీలించారు. అర్బన్ కాలనీలో ఉన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా కొందరు రహదారులు బాగాలేదని, కాలనీ మురుగు కాలవలు బాగు చేయించాలని, కొత్త కాలువలు వేయించాలని, పరిష్కరించి, కొత్త విద్యుత్తులైన్లను వేయించాలని జిల్లా కలెక్టర్ ను, స్థానిక శాసన సభ్యులకు తెలిపారు. స్థానికుల సమస్యలను విన్న జిల్లా కలెక్టర్ వెంటనే తహసిల్దార్ ను, పంచాయతీ వారిని, ఎలక్ట్రికల్ సిబ్బందిని సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా టీడీపీ నాయకులు ఖుద్దూస్ జన్మదిన వేడుకలు



**తెనాలి, మేజర్ న్యూస్ :** తెనాలి పట్టణ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు మహమ్మద్ ఖుద్దూస్ జన్మదిన వేడుకలు స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు శాసన సభ్యులు, పోలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనంద బాబు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమక్షంలో ఖుద్దూస్ కేక్ కట్ చేశారు. ఆయనకు పలువురు పార్టీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పర్మిషన్ తప్పకుండా తీసుకోవాలి : ఎస్ఐ సతీష్



**నకరికల్లు మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన నకరికల్లులో క్రాకర్ షాపులు నిర్వహించేవారు పోలీస్, ఫైర్, రెవెన్యూ, పంచాయతీ పర్మిషన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. నకరికల్లు ఎస్ఐ సతీష్ తెలిపారు శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి సందర్భంగా దీపావళి స్టాల్స్ ను ఏర్పాటు చేయు స్టాల్స్ నిర్వాహకులు క్రాకర్ షాపులు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అలాగే క్రాకర్ షాపులు నిర్వహించేవారు తప్పనిసరిగా పోలీస్, ఫైర్, రెవెన్యూ, పంచాయతీ అనుమతులు తీసుకోవాలని అలా తీసుకొని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు ప్రభుత్వం వారి యొక్క నిబంధనలను ప్రకారం షాపులు యొక్క పనివేళలో పాటించాలని నేను తెలిపారు పండగ సందర్భంగా రోడ్లు పైన స్టాల్స్ పెట్టి ప్రజలకు ఇబ్బందులు పెట్టకూడదని ఆయన అన్నారు.


జనం కోసమే

సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు,
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు.
ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై
మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత
శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని
ముఖులిత హస్తాలతో వేడుకుంటున్నాం..
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా
మీ అభిప్రాయాలను క్లుప్తంగా తెలియజేయాలని
ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియజేస్తున్నాం..

ఎన్.లక్ష్మీనారాయణ
రీజనల్ మేనేజర్
సెల్: 6301107116

పి.బాలు
బ్యూరో ఇంఛార్జ్
సెల్: 9440747307


## నేడు మిస్ ఇండియా అమూల్యకి సన్మానం

**– పార్కు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ**



**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన అమూల్య ప్రియదర్శిని మిస్ ఇండియా గా మూడో స్థానం కైవసం చేసుకొని తొలిసారిగా పట్టణానికి రానున్నారు. ఇటీవల గోవా లో జరిగిన అందాల పోటీల్లో ఈమె తెలంగాణ నుంచి పాల్గొనగా మూడో స్థానంలో నిలిచింది. ప్రపంచ మిస్ యూనివర్స్ పోటీలలో భారత దేశం నుంచి ఈమె పాల్గొననున్నారు. గతంలో మిస్ హైదరాబాద్ కైవసం చేసుకుంది. ఆమె తాత చిలుకా రమేష్ సహాయ లేబర్ ఆఫీసర్ గా పనిచేశారు. ఈ సందర్భంగా పార్కు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని హెూటల్ కార్తికేయ ఫంక్షన్ హాల్లో శనివారం సాయంత్రం 4 గంటలకు సన్మానం చేయనున్నట్లుగా అసోసియేషన్ సభ్యులు, న్యాయవాది చలువాది చిన్న సత్యనారాయణ, మిత్ర బృందం శుక్రవారం తెలిపారు. అభి మానులు, శ్రేయోభిలాషులు, బంధువులు, మిత్రులు, పాత్రికేయులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## మండల స్థాయి క్రీడా పోటీలలో దుర్గా పబ్లిక్ స్కూలు,విద్యార్థులు విజయభేరి

**దాచేపల్లి మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా,దాచేపల్లి మండలం స్కూలు,పరిధిలో నుండి ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడలు మూడు రోజులుగా జరిగిన ఆటల పోటీలు గురువారం సాయంత్రం ఫైనల్ ఆటలు పోటీలు అంగరంగ వైభవంగా ముగిశాయి. దాచేపల్లి నగర పంచాయతీ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన క్రీడా పోటీల్లో అండర్ 14, అండర్ 17 బాలుర, బాలికల విభాగంలో దుర్గా పబ్లిక్ స్కూలు విద్యార్థిని విద్యార్థులు అన్ని క్రీడా విభాగాలలో ఖోఖో,వాలీబాల్ ,రన్నింగ్ (100,200, 300,400,600,800,1500,3000 మీటర్లు) జావలిన్ త్రో ,డిస్కస్ త్రో, షాట్ పుట్, రేస్ వాక్, హై జంప్,లాంగ్ జంప్, షార్ట్ జంప్ లలో మొదటి ప్రథమ, ద్వితీయ, విజేతలుగా 46 మంది విద్యార్థినీ, విద్యార్థులు పోటీలలో ఎంపిక అయ్యారు. మండల స్థాయిలో విజయం సాధించిన విద్యార్థిని, విద్యార్థులు తదుపరి డివిజన్ స్థాయి లో జరిగే క్రీడలలో కూడా ఎంపిక కావడం జరిగింది. మా పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు చదువుల్లోనే కాదు క్రీడల్లో కూడా గొప్ప విజయం సాధించారని దుర్గాపబ్లిక్ స్కూలు ప్రిన్సిపాల్ మల్లికార్జున శర్మ విద్యార్థిని, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించడం జరిగింది. క్రీడారంగంలో కూడా అమోఘమైన ప్రతిభను కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు అందుకు అనుగుణంగా క్రీడలలో మెరుగైన శిక్షణ ఇచ్చిన పీఈటీ బాజీ బాబు, చంద్రికలను ఉపాధ్యాయులు సాగర్ సిమెంట్స్ యాజమాన్యం వారు వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.



## మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి : పిడి ఝాన్సీ రాణి



**పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** కోటప్పకొండ కార్యాలయంలోని జిల్లా సమాఖ్య సమావేశం లో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్య నిర్వహణ అధికారి ఆదేశాల మేరకు స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే ఉద్దేశ్యంతో పల్నాడు జిల్లా కు 5.07 కోట్ల రూపాయలను కమ్యూనిటీ ఇన్వెస్ట్మెంట్ ఫండ్ పంపించటం జరిగింది. దీనికి సంబంధించి ప్రభుత్వం గ్రామ నిధి అనే పోర్టల్ ను ప్రారంభించారు. దీని ద్వారా జిల్లాలోని 26 మండలాలకు,మండలానికి 19.50 లక్షల రూపాయలను మంజూరు చేయటం జరిగింది. గ్రామ సంఘాలలోని స్వయం సహాయక సంఘాల వారు అవసరం మేరకు దానిని గ్రామ నిధి పోర్టల్ లో అప్లోడ్ చేసుకోవాలని మండల సమాఖ్య ప్రతినిధులకు ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి తెలియజేశారు. అదేవిధంగా జిల్లా సమాఖ్య ప్రతిందులందరూ కలిసి స్వయం సహాయక సంఘాలకు సంబంధించి గ్రామ సంఘం అసిస్టెంట్ లుగా మహిళలు మాత్రమే కొనసాగాలని ఏకగ్రీవంగా జిల్లా సమాఖ్య సమావేశంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రజని ఆధ్వర్యంలో తీర్మానించటం జరిగింది. గ్రామ సంఘం అసిస్టెంట్ గా మహిళలు ఉంటే ఏ విధమైన సమాచారమైన మేము చెప్పకోవటానికి అభ్యంతరాలు ఉండవని జిల్లా సమాఖ్య ప్రతినిధులు ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి కి తెలియజేయటం జరిగింది. సమావేశంలో ఏ పి డి రాజా ప్రతాప్ ,డి పి ఎం లు మల్లీశ్వరి ,శ్రీనివాస్ ,డేవిడ్ ,ప్రకృతి వ్యవసాయం కార్యాలయం నుండి ప్రేమ్ రాజు ,జిల్లా సమాఖ్య ప్రతినిధులు,ఎల్ సి నాగూర్ , పాల్గొన్నారు.

## బోడేపూడి వెంకట సుబ్బారావుకు వినుకొండలో అభినందన సత్కారం

**వినుకొండ మేజర్ న్యూస్ :** శ్రీశైలం దేవస్థానం పాలకమండలి సభ్యులుగా (ధర్మకర్తల మండలి) నియమితులైన బోడేపూడి వెంకట సుబ్బారావు బి ఎస్ ఆర్ కి వినుకొండ ప్రాంతంలో ఘన సన్మానం జరిగింది. మహానాడు మీడియా అధినేతగా, ప్రముఖ పారిశ్రామిక వేత్తగా సుపరిచితులు, వినుకొండ ప్రాంత వాసి అయిన బి ఎస్ ఆర్ వినుకొండ లో ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరయ్యారు. , ఆర్కే మిత్ర మండలి సభ్యులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మిత్ర మండలి ప్రతినిధులు బి ఎస్ ఆర్ ని శాలువా, పూలగుచ్ఛంతో సత్కరించి, శ్రీశైలం దేవస్థానం అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలకు ఆయన సేవలు ఎంతో ఉపయోగపడలని ఆకాంక్షించారు. ఈ అభినందన సత్కార కార్యక్రమం వినుకొండలో జరిగింది. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఐటీడీపీ అధ్యక్షుడు తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు,బొల్లాపల్లి మండల టిడిపి పార్టీ అధ్యక్షులు మేరాజోత్ హనుమ నాయక్, పెమ్మసాని రామకృష్ణ,జాగర్లమూడి సుబ్బారావు,ఎల్లిశెట్టి రంగయ్య,పాలడుగు కృష్ణ, గొడుగులూరి సుబ్బారావు, యెగినాటి నరసింహారావు,పెమ్మసాని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## పట్టణంలోని ఏ.సి. కాలేజ్ గ్రౌండ్‌లోనీ అసెంబ్లీ హాలులో నిర్వహించిన జీఎస్టీ ఎగ్జిబిషన్






**గుంటూరు మేజర్ న్యూస్ :** పట్టణంలోని ఏ.సి. కాలేజ్ గ్రౌండ్‌లో నీ అసెంబ్లీ హాలులో నిర్వహించిన జీఎస్టీ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. గుంటూరు పశ్చిమ నియోజక వర్గ శాసన సభ్యురాలు గళ్ళ మాధవి, గుంటూరు తూర్పు నియోజక వర్గ శాసన సభ్యులు నసీర్ అహ్మద్, నగర డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, నగర పాలక కమిషనర్ పులి. శినివాసులు, సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జీఎస్టీ జాయింట్ కమిషనర్ గీతా మాధురితో కలసి ఘనంగా ప్రారంభించిన అనంతరం ప్రజా ప్రతినిధులు మీడియాతో మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ విధానంతో వ్యాపార, వ్యవసాయ రంగాలకు కొత్త ఊపిరి లభించిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పన్ను భారం తగ్గించే దిశగా తీసుకున్న సూపర్ జీఎస్టీ అన్నీ వర్గాలకు ఉపయోగకరంగా వుందన్నారు. వ్యవసాయ రంగంలో ఉపయోగించే యంత్ర పరికరాలపై జీఎస్టీ గణనీయంగా తగ్గడం రైతులకు పెద్ద ఊరటని అన్నారు. మధ్యతరగతి ప్రజలకు ఈ జీఎస్టీ సంస్కరణలు ఒక వరంగా నిలుస్తున్నాయని వారు పేర్కొన్నారు. ప్రజల జీవితంలో అవసరమైన అన్ని రంగాలలోనూ జీఎస్టీ రేట్లు గణనీయంగా తగ్గడంతో వినియోగదారులు దాని ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. తక్కువ పన్నులతో అందుబాటులోకి వస్తున్న ఉత్పత్తులను పరిశీలించి, దేశ ఆర్థిక ప్రగతికి భాగస్వాములుగా మారాలని ప్రజలకు పిలుపునిచ్చారు. చిన్న మధ్య తరగతి వ్యాపార సంస్థలకు కూడా తక్కువ పన్ను రేట్లతో తమ వ్యాపారాలను మరింత విస్తరించుకొనే అవకాశం కలదన్నారు. అలాగే అత్యవసర మందుల ఉత్పత్తులపై, గృహ వినియోగ వస్తువులపై విద్యుత్ పరికరాలు, అవసరమైన దిన చర్యలో వినియోగించే వస్తువులపై పన్ను తగ్గించటం ద్వారా సాధారణ ప్రజలు జీవ విధానంపై ప్రభావం తగ్గుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్నసూపర్ జీఎస్టీ సదుపాయాలను ప్రతి కుటుంబం తెలుసుకొని ఉపయోగించుకోవాలి అని అన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో గుంటూరుకు చెందిన పలు హెూమ్ అప్లయెన్సెస్ కంపెనీలు, ఎలక్ట్రానిక్స్, ప్రతినిధులు ఆటోమొబైల్ రంగాలు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. పౌరులు, విద్యార్థులు, వ్యాపార వేత్తలు భారీ సంఖ్యలో హాజరై ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు జీఎస్టీ 2.0లో ప్రవేశపెట్టిన కొత్త నిబంధనలు, తక్కువ పన్నుల విధానాలు, వినియోగదారుల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు.